# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత దేశం ఒకటిగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ధాన్యం సేకరణకు ఎపి మార్క్ ఫెడ్ కు 5 వేల కోట్ల రూపాయల రుణాన్ని పొందేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
3. **హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.**
4. **రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**
5. **గోవాలో నిర్వహించిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవం - ఇఫి - 2025లో ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ శకటానికి ప్రథమ బహుమతి లభించింది.**

==========================

ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి – జిడిపి రేటు 8.2 శాతం నమోదవడంపై ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఆర్థిక సేవలు, నిర్మాణ రంగం, తయారీ, స్థిరాస్థి వ్యాపారం వంటి కీలక రంగాలు దేశ ఉత్పాదకతను గణనీయంగా పెంచుతున్నట్లు పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా సాగుతున్న ప్రయాణంలో.. దేశ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంస్కరణలకు జిడిపి వృద్ధి నిదర్శనమని వెల్లడించాంచారు.

--------------------------

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు ఎపి మార్క్ ఫెడ్ కు 5 వేల కోట్ల రూపాయల రుణాన్ని పొందేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశ వివరాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడిస్తూ.. ఖాళీ స్థలాలపై విధించే పన్నులో 50 శాతం మినహాయింపునకు ఆమోదం తెలిపామన్నారు. పోలవరం ప్రాజెక్టులో భాగంగా 542 కోట్ల 85 లక్షల రూపాయల పనులు చేపట్టేందుకు అనుమతించినట్లు చెప్పారు. రాజధాని అమరావతి విస్తరణకు

రెండవ దశ భూసమీకరణ చేయనున్నట్లు పేర్కొంటూ...

వాయిస్... 40 సెకన్లు

---

గ్రేటర్ హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలోని బాగ్ లింగంపల్లి, కవాడి గూడలో ఇందిరమ్మ క్యాంటీన్లను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఇందిరమ్మ పేరుతో ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

---

రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గం, గుడిపాడు గ్రామంలో కోటి 77 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న 48 మందికి 35 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా డిసెంబరు నెలకు 63 లక్షల 25 వేల 999 మంది లబ్ధిదారులకు 2 వేల 738 కోట్ల 71 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ పథకం కింద 8 వేల 190 మంది లబ్ధిదారులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం, గోపాలపురం గ్రామంలో డిసెంబర్ 1వ తేదీన సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేస్తారని మంత్రి వెల్లడించారు.

---

గోవాలో 56వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం – ఇఫి నిన్న నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంతో ముగిసింది. ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ పీకాక్ అవార్డును వియత్నాం చిత్రం 'స్కిన్ ఆఫ్ యూత్' కైవసం చేసుకుంది. సిల్వర్ పీకాక్ విభాగంలో.. మరాఠీ చిత్రం గోంధాల్‌కు దర్శకత్వం వహించిన సంతోష్ దవాఖర్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. స్పానిష్ చిత్రం 'ఎ పోయెట్'లో నటించిన  ఉబేమార్ రియోస్ ఉత్తమ నటుడిగా, స్లోవేనియన్ చిత్రం 'లిటిల్ ట్రబుల్ గర్ల్స్'లో నటించిన జరా సోఫిజా ఓస్త్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు.

భారతీయ సినీ రంగంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రముఖ నటుడు రజనీకాంత్‌ను, గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్, కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురగన్ సత్కరించారు. ఈ సందర్భంగా మరికొన్ని అంశాల్లోను అవార్డులను ప్రధానం చేశారు.

---

గోవాలో నిర్వహించిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవం – ఇఫి – 2025లో ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ శకటానికి మొదటి బహుమతి లభించిందని రాష్ట్ర చలన చిత్ర, టి.వి, నాటకరంగ అభివృధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తెలిపారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవ వేడుకల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 శకటాలు ప్రదర్శించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిన్న శకటాలకు ప్రదర్శనల ఆధారంగా బహుమతులు ప్రకటించారని విశ్వనాథన్ తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

వినికిడి లోపం కలిగిన వారికి సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో 63 ప్రభుత్వ వైద్య శాలల్లో అవసరమైన పరికరాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 9 జిల్లా ఆసుపత్రులు, 54 ప్రాంతీయ ఆసుప్రతుల్లో ఈ పరికరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం 15 కోట్ల 11 లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఆయా ఆసుపత్రులలో పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

---------------------------

దిత్వా తుపాను పుదుచ్చేరికి 430 కిలో మీటర్లు, చెన్నైకి 510 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. నైరుతి బంగాళాఖాతం మీదుగా ఉత్తర–వాయువ్య దిశగా కదులుతూ సోమవారం తెల్లవారుజామున ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, ఆనుకుని ఉన్న దక్షిణ–ఆంధ్రప్రదేశ్ తీరాలకు చేరుకునే అవకాశం ఉందని అమరావతి వాతావరణకేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

..వాయిస్... 25 సెకన్లు

ఆంధ్రప్రదేశ్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినప్పటికీ చలి వాతావరణం కొనసాగుతుంది.

తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని భాతర వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================